# సాక్షి అనంతపురం

ఆదివారం । 2 । జూన్ । 2024






**చీనీ టన్ను రూ.38 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.



**కడుపు కోత.. జేబు గుల్ల**

సాధారణ కాన్పులు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు గండి కొడుతున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
42.6°/26.1°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### 48,749 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ



అనంతపురం అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా శనివారం నాటికి 55,318 మంది రైతులకు 48,749 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అందజేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆర్బీకే వేదికగా 72,538 మంది రైతులు 64,059 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఏపీ సీడ్స్ ద్వారా కేటాయింపుల మేరకు 76 వేల క్వింటాళ్లు సరఫరా చేస్తున్నందున.. సాధ్యమైనంత తొందరగా విత్తనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరోపక్క విత్తన కందులు, పచ్చిరొట్ట విత్తనాల రిజిస్ట్రేషన్లు, పంపిణీ కొనసాగుతోందని తెలిపారు.

### కౌంటింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి

అనంతపురం అర్బన్: కౌంటింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆర్‌ఓలు, నోడల్ అధికారులు, ఏఆర్‌ఓలు, తహసీల్దార్లు, కౌంటింగ్ సిబ్బందితో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లను లోపలికి పంపే ముందు బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయాలన్నారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. బ్లాకల ఎదుట ఏజెంట్ల కోసం టెంట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ అల్పాహారం రూ.50, భోజనం రూ.100, టీ, కాఫీ, టిఫిన్ రూ.25కు అందించాలని చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లు పెన్, పేపర్ తీసుకురాకూడదన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి కౌంటింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషన్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### సెలవులో సమగ్రశిక్ష జీసీడీఓ



షమా

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్షలో కేజీబీవీలను పర్యవేక్షించే జీసీడీఓ మహేశ్వరి శనివారం నుంచి సెలవులో వెళ్లారు. 15 రోజుల పాటు ఆమె చైల్డ్‌కేర్ సెలవు పెట్టారు. దీంతో జీసీడీఓ ఇన్‌చార్జ్ బాధ్యతలను ఐఈడీ కోఆర్డినేటర్ షమాకు అప్పగించారు.

# పవనపుత్రా పాహిమాం

జిల్లాలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆంజనేయ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పవన పుత్రుడి కటాక్షం కోసం భక్తులు పోటెత్తారు. కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న హనుమంతుడి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. భజే ఆంజనేయం నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. – గుంతకల్లు





స్వర్ణ వజ్ర కవచ అలంకరణలో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి, భక్తులతో కిటకిటలాడుతున్న స్వామివారి ఆలయం



ఒంటె వాహనంపై ఊరేగుతున్న నెట్టికంటుడు

# ఉదయం 8 నుంచి కౌంటింగ్

- తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- అరగంట తర్వాత ఈవీఎం ఓట్ల గణన
- కౌంటింగ్ పూర్తయ్యాకే పోస్టల్ బ్యాలెట్ ఫలితాల ప్రకటన
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్
- జేఎన్‌టీయూలో పటిష్ట బందోబస్తు: ఎస్పీ గౌతమి శాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ గౌతమి శాలి, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం అర్బన్: జేఎన్‌టీయూలో 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా ఎస్పీ గౌతమి శాలితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు,వారి ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఉదయం 7.30 గంటలకు ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు తెరుస్తారని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తామని, 30 నిమిషాల అనంతరం ఈవీఎం ఓట్ల లెక్కింపు మొదలవుతుందన్నారు. అన్ని రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత చివరలో పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు, ఈవీఎంలు ఎలా తెరవాలి అనేదానిపై ఇప్పటికే సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. పరిశీలకుల ఆధ్వర్యంలో, ఆర్‌ఓల సమక్షంలో కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తామని, మళ్లీ 4వ తేదీ ఉదయం 5 గంటల్లోగా మూడో విడతగా ర్యాండమైజేషన్ పూర్తి చేస్తామన్నారు. ఆ తరువాత సిబ్బందికి టేబుళ్లు కేటాయిస్తామన్నారు. కౌంటింగ్ నిర్వహణపై డ్రెస్ రిహార్సల్స్‌ను ఆదివారం చేపడతామని చెప్పారు.

**ప్రత్యేక మేజిస్ట్రేట్ల నియామకం**

కౌంటింగ్ రోజున ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేకంగా మేజిస్ట్రేట్లను నియమించామన్నారు. నియోజకవర్గానికి ఎనిమిది మంది చొప్పున మేజిస్ట్రేట్లు ఉంటారన్నారు. జేఎన్‌టీయూ ఆవరణలో నలుగురు ప్రత్యేక మేజిస్ట్రేట్లు ఉంటారని, వీరి వెంట ఒక పోలీసు బృందం ఉంటుందని వివరించారు.

**గట్టిగా మాట్లాడినా చర్యలు..**

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో కౌంటింగ్ ఏజెంట్లు క్రమశిక్షణతో ఉండాలని కలెక్టర్ సూచించారు. ఏదైనా సందేహం వస్తే సంబంధిత అధికారి దృష్టికి తీసుకువచ్చి సామరస్యంగా మాట్లాడి నివృత్తి చేసుకోవాలన్నారు.అలాకాకుండా అధికారుల విషయంలో గట్టిగా మాట్లాడినా, దురుసుగా ప్రవర్తించినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌంటింగ్ రోజున విజయోత్సవాలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. గెలిచిన అభ్యర్థిని పోలీసు బందోబస్తుతో వారి ఇంటికి చేరుస్తామన్నారు. తదుపరి ఆదేశాలిచ్చే వరకు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ కొనసాగుతుందన్నారు.

**నిఘా నీడలో జేఎన్‌టీయూ**

కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గౌతమి శాలి తెలిపారు. జేఎన్‌టీయూ పూర్తిగా కెమెరాల నిఘాలో ఉంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. డ్రోన్ కెమెరాల నిఘా కూడా ఉంటుందని, చిన్నపాటి గొడవకు పాల్పడినా కేసు నమోదు చేస్తామని చెప్పారు. కౌంటింగ్ సందర్భంగా నమోదు చేసే కేసులు జీవితాంతం వెంటాడతాయన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బైండోవర్ చేస్తారన్నారు. ఘటనను బట్టి జిల్లా బహిష్కరణ కూడా చేస్తారన్నారు. కాబట్టి ఎవరూ ఎలాంటి హింసకు, గొడవలకు పాల్పడకూడదని హితవు పలికారు. జిల్లావ్యాప్తంగా గుర్తించిన 315 సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బలగాల బందోబస్తు ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 6 వేల మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి కారణం లేకుండా బయటి వ్యక్తులు నగరంలోని లాడ్జీలు, హోటళ్లలో ఉండకూడదన్నారు. జూన్ 3న లాడ్జీలు, హోటళ్లను పోలీసులు తనిఖీ చేస్తారని, సరైన కారణం ఉంటేనే బయటి వ్యక్తులు ఉండేందుకు అనుమతిస్తామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే జేఎన్‌టీయూ పరిసర ప్రాంతాల్లో నివసించే వారికి కూడా నోటీసులు ఇచ్చామని, త్వరలో లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులకు నోటీసులందిస్తామన్నారు. సమావేశంలో డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### క్రమశిక్షణ కలిగిన వారినే ఏజెంట్లుగా పంపండి

క్రమశిక్షణ కలిగిన వారినే కౌంటింగ్ ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకోవాలని అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. కౌంటింగ్ పకడ్బందీగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్ కోసం ముగ్గురు సాధారణ పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించినట్లు చెప్పారు. జూన్4న ఉదయం 6.30 గంటల కల్లా అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు అందుబాటులో ఉండాలని సూచించారు. కౌంటింగ్ గదిలో ఇబ్బందులు కలిగిస్తే బయటకు పంపిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీఎంలను గోడౌన్లలో భద్రపరిచే ప్రక్రియకు అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏఆర్‌ఓ రమేష్‌రెడ్డి, అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఇంటర్ ఆన్‌లైన్ మూల్యాంకనం

- జిల్లాకు 28 వేల జవాబుపత్రాల కేటాయింపు
- 10 రోజుల్లో మూల్యాంకనం పూర్తి చేస్తామంటున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ జవాబుపత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం ఆదివారం ప్రారంభం కానుంది. ఇంటర్ జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవాల్యుయేషన్ ఇప్పటికి రెండేళ్లుగా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. అయితే ఈసారి ఇంటర్ బోర్డు సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసేలా నిర్ణయించిందని ఆర్‌ఐఓ ఎం. వెంకటరమణనాయక్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్జెక్టుల వారీగా అధ్యాపకులను గుర్తించి ఆన్‌లైన్ మూల్యాంకనంపై ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. శాంపిల్‌గా ఐదు జవాబు పత్రాలను మూల్యాంకనం పూర్తి చేసిన వారికే ఆన్‌లైన్ వాల్యుయేషన్ విధులు చేపట్టేలా టీచర్ యూనిక్ ఐడీ, పాస్ వర్డ్‌లను కేటాయించామన్నారు. క్యాంపులతో నిమిత్తం లేకుండా జవాబుపత్రాలను ఇంటివద్ద, కళాశాలలో కంప్యూటర్ స్క్రీన్/ల్యాప్‌టాప్ స్క్రీన్‌పై చూస్తూ ఆయా ప్రశ్నల సమాధానాలకు మార్కులను నమోదు చేసేలా ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జవాబు పత్రంలోని ప్రతి ప్రశ్నకు విద్యార్థి రాసిన సమాధానాన్ని మూల్యాంకనం చేసిన తర్వాతే తదుపరి ప్రశ్నకు సమాధానం కనబడుతుందన్నారు. విద్యార్థి రాసిన సమాధానానికి మూల్యాంకనం సరిగా జరిగిందా, లేదా పరిశీలించడంతో పాటు మార్కుల నమోదును గమనించేందుకు ప్రతీ ఐదుగురు అసిస్టెంట్ ఎగ్జామినర్ల (లెక్చరర్స్) పైనా సెకండ్ లెవెల్ వాల్యుయేషన్ నిమిత్తం ఒక చీఫ్ ఎగ్జామినర్ ఉంటారన్నారు. జిల్లాకు మొత్తం 28,000 జవాబు పత్రాలను కేటాయించారని వెల్లడించారు. పదిరోజుల్లో వాల్యుయేషన్ ముగించాలని లక్ష్యం విధించుకున్నట్లు వెంకటరమణ నాయక్ తెలిపారు.

# నాలుగేళ్లు కుండపోత.. ఓసారి వెక్కిరింత!

- 2023 జూన్ నుంచి మే 2024తో ముగిసిన వర్షపు ఏడాది
- సాధారణ వర్షపాతం 512.5 మి.మీ.., కురిసింది 400 మి.మీ
- అంతకుముందు నాలుగేళ్లు దండిగా వర్షం



2022 సెప్టెంబర్‌లో కురిసిన వర్షానికి మరువ పారుతున్న జిల్లాలోనే అతి పెద్దదైన శింగనమల చెరువు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు అధికారంలోకి రాగానే వరుణుడు కరుణించాడు. జిల్లాలో కరువుతీరేలా వర్షాలు కురిశాయి. మొదటి నాలుగేళ్లు వానలు కుమ్మేయగా... చివరి ఏడాది మాత్రమే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా, రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా వర్షాభావం ఏర్పడిన విషయం తెలిసిందే. బెంగళూరు లాంటి వర్షాలు కురిసే నగరంలో కూడా ప్రజలు ఈ సారి తాగునీటికి ఇబ్బంది పడటం గమనార్హం. ఎల్‌నినో కారణంగా గతేడాది దేశవ్యాప్తంగా వర్షాభావం, కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి.

**21.3 శాతం లోటు..**

గత 2023 జూన్ 1 నుంచి 2024 మే 31తో ముగిసిన వర్షపాత సంవత్సరంలో సాధారణం కన్నా 21.3 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. 512.5 మి.మీ గానూ 400.6 మి.మీ వర్షం కురిసింది. అందులో కీలకమైన జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌లో నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపకపోవడంతో 319.6 మి.మీ గానూ 22.6 శాతం తక్కువగా 247.4 మి.మీ నమోదు కాగా రబీకి సంబంధించి అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య ఈశాన్య రుతుపవనాలు కూడా ప్రభావం చూపని కారణంగా 139.3 మి.మీ గానూ కేవలం 45.8 మి.మీ నమోదైంది. వేసవిలో మాత్రం అంటే మే నెలలో మంచి వర్షాలు పడటంతో ఎట్టకేలకు 400.6 మి.మీ వద్ద ఏడాది వర్షపాతం ఆగిపోయి 21.3 శాతం లోటు ఏర్పడింది. మొత్తమ్మీద చూస్తే ఖరీఫ్‌లో 31 రోజులు, రబీలో 6 రోజులు, వేసవిలో 9 రోజులు... వెరసి ఈ ఏడాది 46 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. అంతకు మునుపు 2019 నుంచి 2022 వరకు నాలుగేళ్లు కుండపోత వర్షాలతో 'అనంత' జలసిరిని సంతరించుకుంది. 2021, 2022లో అయితే రికార్డు స్థాయిలో సాధారణం కన్నా రెట్టింపు స్థాయిలో వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

**16 మండలాల్లో లోటు వర్షపాతం**

జిల్లాలో ఉన్న 31 మండలాలకు గానూ 16 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.రాయదుర్గం, కణేకల్లు, విడపనకల్లు, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు,పామిడి,బ్రహ్మసముద్రం,కళ్యాణదుర్గం, నార్పల, అనంతపురం, రాప్తాడు, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, వజ్రకరూరు మండలాల్లో సాధారణం కన్నా తక్కువగా వర్షాలు కురిశాయి. కేవలం ఆత్మకూరులో మాత్రమే సాధారణం కన్నా 30 శాతం అధికంగా నమోదు కాగా మిగతా 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

**ఈ సారి ఆశాజనకంగా వర్షాలు!**

ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగానే పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. వారి అంచనాలను నిజం చేస్తూ ఇప్పటికే జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా విత్తన వేరుశనగ, కందులు, పెసలు, మినుములు, రాగులు, కొర్రలు తదితర విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తుండడంతో సంతోషంగా ముందుకు సాగుతున్నారు.

### నేడు భారీ వర్షం!

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఆదివారం భారీ వర్షం పడే సూచనలు ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు శనివారం బులెటిన్ విడుదల చేశారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అందించిన సమాచారం మేరకు గత నెల 31న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు చురుగ్గా పయనిస్తున్నాయన్నారు. ఈ నెల 3 లేదా 4 తేదీల్లోనే జిల్లాలోకి ప్రవేశించడానికి అనుకూల వాతావరణం నెలకొన్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆదివారం జిల్లాలో కొన్ని చోట్ల భారీ వర్షం పడవచ్చన్నారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు, అలాగే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందన్నారు. సోమవారం నుంచి మరో రెండు రోజులు తేలికపాటి వర్షసూచన ఉందని వివరించారు.

**2023-24లో నెల వారీగా సాధారణం, కురిసిన వర్షపాత వివరాలు ఇలా**

| నెల | సాధారణం | కురిసింది | తక్కువ/ఎక్కువ |
|---|---|---|---|
| జూన్ 2023 | 61.0 మి.మీ | 45.8 మి.మీ | 24.9 శాతం తక్కువ |
| జూలై ,, | 63.9 ,, | 73.3 ,, | 14.7 శాతం ఎక్కువ |
| ఆగస్టు ,, | 83.8 ,, | 13.7 ,, | 83.7 శాతం తక్కువ |
| సెప్టెంబర్ ,, | 110.9 ,, | 114.6 ,, | 3.3 శాతం ఎక్కువ |
| అక్టోబర్ ,, | 100.9 ,, | 6.4 ,, | 93.7 శాతం తక్కువ |
| నవంబర్ ,, | 28.6 ,, | 33.6 ,, | 17.5 శాతం ఎక్కువ |
| డిసెంబర్ ,, | 9.8 ,, | 5.8 ,, | 40.8 శాతం తక్కువ |
| జనవరి-2024 | 1.8 ,, | 0.00 ,, | 100 శాతం తక్కువ |
| ఫిబ్రవరి,, | 0.8 ,, | 0.00 ,, | 100 శాతం తక్కువ |
| మార్చి ,, | 2.1 ,, | 0.00 ,, | 100 శాతం తక్కువ |
| ఏప్రిల్ ,, | 12.1 ,, | 0.6 ,, | 95 శాతం తక్కువ |
| మే ,, | 36.7 ,, | 106.7 ,, | 217.8 శాతం ఎక్కువ |
| మొత్తం ఏడాదిలో | 512.5 ,, | 400.6 ,, | 21.3 శాతం తక్కువ |

# అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి అన్నారు. కౌంటింగ్ జరిగే జేఎన్‌టీయూ (ఏ) పరిసరాలను శనివారం డీఐజీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. ఇందుకు సమష్టిగా శ్రమిద్దామని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా దీటుగా ఎదుర్కోవాలన్నారు. కౌంటింగ్ ముగిసే వరకూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో పికెట్లు, మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రెస్పాన్స్ టీంలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగ్జిట్ పోల్స్ వెలువడిన నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోలన్నారు. డీఐజీ వెంట ఎస్పీ గౌతమి శాలి ఉన్నారు.



ఎస్పీ గౌతమిశాలితో కలిసి జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐజీ షిమోషి

## క్లుప్తంగా

### హంద్రీనీవా డీఈఈగా రామచంద్రమూర్తి



**అనంతపురం సెంట్రల్:** హంద్రీనీవా సబ్ డివిజన్-5 డీఈఈగా రామచంద్రమూర్తి నియమితులయ్యారు. శనివారం ఎస్ఈ దేశేనాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఉద్యోగులు శ్రీనివాసులు, వీరేంద్ర, సుధాకర్, మహబూబ్‌బాషా ఉన్నారు.

### సహకార కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం అగ్రికల్చర్:** సహకారశాఖ పరిధిలో నిర్వహించే డిప్లొమా ఇన్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (డీసీఎం, సీఏ) కోర్సులో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్ పాసైన వారితో పాటు సహకార చట్టం కింద రిజిస్టర్ అయిన సొసైటీ పాలక వర్గాలు, అధికారులు, సంస్థలో పనిచేసే సిబ్బంది కూడా కోర్సు చేయడానికి అర్హులన్నారు. 9వ బ్యాచ్ కింద 24 వారాల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 94907 41137లో సంప్రదించాలని సూచించారు.

### అప్రమత్తంగా ఉండండి

**కణేకల్లు:** కౌంటింగ్ అనంతరం హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా మూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి జిల్లా అడిషనల్ ఎస్పీ రామకృష్ణ సూచించారు. కణేకల్లు పోలీసు స్టేషన్‌లో శనివారం సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఆ తర్వాత జరిగే పరిణామాలేలా ఉంటాయో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ ఐశ్వర్య, ఈశ్వరరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

### ప్రమాదంలో వ్యక్తి మృతి

**వజ్రకరూరు:** వాహనం బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం రామగిరి గ్రామానికి చెందిన పోలయ్య (65) శనివారం సాయంత్రం విడపనకల్లు మండలం జనార్దనపల్లి నుంచి ఆవులను టాటా ఏస్ వాహనంలో ఎక్కించుకుని బయలుదేరాడు. వజ్రకరూరు మండలం ధర్మపురి వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన పోలయ్యను 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

# కడుపు కోత.. జేబు గుల్ల

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా సిజేరియన్లు
- ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాల నిర్వాకం
- ఒక్కో సిజేరియన్‌కు రూ.50 వేలకు పైగా వసూలు

‘దగ్గుతూ వెళితే వైద్యం కూడా ప్రియమే’ అనే పెద్దల నానుడి నేడు వైద్య వృత్తిలో కొనసాగుతున్న కొందరిని చూస్తే నిజమేనని నిర్ధారణ అవుతోంది. వైద్య వృత్తిలో కొందరి సంపాదన యావ.. కాసుల కక్కుర్తి .. తల్లిదండ్రులు కాబోయే దంపతుల జేబులు గుల్ల చేస్తున్నాయి. సాధారణ కాన్పులు పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడుతూ నెలలు నిండిన గర్భిణుల కడుపు కోత (సిజేరియన్)తో కాసులు దండుకుంటున్నారు. ఎలాగైనా రోజుకు పది వరకైనా ‘కడుపులు కోసి’ ఆర్థికంగా కూడబెట్టుకోవాలనే తాపత్రయం ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకుల్లో కనిపిస్తోంది.



ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి (ఫైల్)

**అనంతపురం మెడికల్:** జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకుల ధనదాహం తీరడం లేదు. ధనార్జనే ధ్యేయంగా ఇష్టారాజ్యంగా సిజేరియన్ చేసేస్తూ రూ.లక్షలు పోగేసుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే గర్భిణి ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా సిజేరియన్ తప్పనిసరిగా చేయాల్సి వచ్చిందంటూ బుకాయిస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో అత్యధిక సంఖ్యలో సిజేరియన్లు జరుగుతున్న విషయం తెలుసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

**రెండేళ్లలో 31,983 ప్రసవాలు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో మొత్తం 142 ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. ఇందులో 51 ఆస్పత్రుల్లో గైనిక్ సేవలందిస్తున్నారు. గడిచిన రెండేళ్లలో కేవలం ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే 31,983 ప్రసవాలు జరిగాయి. 2022-23లో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 16,585, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 23,301 ప్రసవాలు జరిగాయి. ఇందులో ప్రైవేట్ ఆస్పత్రుల్లో 15,787 సిజేరియన్లు చేశారు. అలాగే 2023-24లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 16,060 ప్రసవాలు జరిగితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో 22,135 జరిగాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 16,116 సిజేరియన్లు చేశారు.

**కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు ఇలా..**

- నగరంలోని గంగ, గౌరీ థియేటర్ సమీపంలో ఉన్న పేరు మోసిన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో 2022-23కు గాను 765 ప్రసవాలు జరిగితే ఇందులో 633 సిజేరియన్లు ఉన్నాయి.
- సాయినగర్ మొదటి క్రాస్‌లోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో 2022-23లో 690 ప్రసవాలు జరిగితే ఇందులో 610 సిజేరియన్లు ఉన్నాయి.
- ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మెడిసిన్ విభాగంలో దీర్ఘకాలికంగా పని చేసిన ఓ సీనియర్ వైద్యాధికారి నిర్వహిస్తున్న ప్రైవేట్ నర్సింగ్‌హోంలో 2022-23లో 267 ప్రసవాలు జరిగితే ఇందులో 245 సిజేరియన్లు ఉండడం గమనార్హం.
- 2023-24లో అరవిందనగర్‌లోని ఓ ఆస్పత్రిలో 144 ప్రసవాలకు గాను 130 సిజేరియన్లు చేశారు.
- ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న ఓ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో 275 ప్రసవాలు జరిగితే ఇందులో 244 సిజేరియన్లు ఉన్నాయి.

**రూ.50వేలకు పైమాటే**

ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులకు గర్భిణులు, బాలింతల కేసులే ఆదాయ వనరుగా మారాయి. గర్భస్థ సమయం నుంచి కాన్పు అయ్యే వరకూ వివిధ పరీక్షలు, స్కానింగ్‌ల పేరుతో దాదాపు రూ.50వేలకు పైగానే ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. కాన్పు సమయంలో బిడ్డ అడ్డం తిరిగిందని, ఉమ్మ నీరు లేదని తదితర కారణాలు చూపుతూ సిజేరియన్ తప్ప మరో మార్గం లేదని గర్భిణి కుటుంబసభ్యులను మభ్య పెట్టేస్తారు. ఆ పరిస్థితుల్లో గర్భిణిని మరో ఆస్పత్రికి తరలించడం ప్రమాదమని భయపెడతారు. డిమాండ్ మేరకు డబ్బు రాబట్టుకుని సిజేరియన్ చేయించే పరిస్థితికి గర్భిణి కుటుంబసభ్యులను నెట్టేస్తున్నారు. చివరకు ఆరోగ్య శ్రీ కింద అడ్మిట్ అయిన వారితోనే అదనంగా డబ్బు కట్టించుకున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

**ఐదు ఆస్పత్రులకు షోకాజ్**

అత్యధిక సిజేరియన్లు చేసిన ప్రైవేట్ ఆస్పత్రుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. ఆయా ఆస్పత్రుల నిర్వాహకులతో సమావేశమై ఆరా తీశాం. ఈ క్రమంలోనే ఐదు ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం.

– డాక్టర్ భ్రమరాంబదేవి, డీఎంహెచ్ఓ

### ఏపీజీబీలో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

**కడప కోటిరెడ్డిసర్కిల్:** ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు 19వ వార్షికోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ బ్యాంకు వ్యాపార నిర్వహణలో ఇతర బ్యాంకుల కంటే ముందు ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విరివిగా రక్తదానం చేయాలని ఖాతాదారులను కోరారు. 70 సార్లకు పైగా రక్తదానం చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డిని అభినందించారు. రీజినల్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్, ప్రధాన, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### పేలుడు పదార్థం తిన్న గేదెకు గాయాలు



గాయపడిన గేదె

**రొద్దం:** పేలుడు పదార్థం తిన్న గేదె నోరు ఛిద్రమైంది. వివరాలు.... రొద్దం గ్రామానికి చెందిన పాడి రైతు సరోజమ్మ శనివారం ఉదయం తన గేదెను గ్రామ సమీపంలోని చిన్న చెరువు వద్దకు మేపునకు తోలుకెళ్లింది. బయలు ప్రదేశంలో పచ్చిగడ్డి మేస్తుండగా గేదె నోట్లో పేలుడు పదార్థం చిక్కుకుని పేలింది. దీంతో గేదె దవడ పేలిపోయింది. అడవి పందులు వేటాడేందుకు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన డిటోనేటర్ కలిపిన అన్నం ముద్ద తినడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. చికిత్స కోసం గేదెను హిందూపురంలోని పశువైద్యశాలకు తరలించారు.

## దారిదోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**గుంతకల్లు:** లారీ డ్రైవర్, క్లీనర్‌ను బెదిరించి సెల్ ఫోన్లు, నగదు లాక్కొన్న కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని కనపర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఇషాక్, క్లీనర్ సునీల్ కర్ణాటకలోని హోస్పేట్ నుంచి జమ్మలమడుగు సమీపంలోని దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీకి స్లాగ్ (జిప్సం) లోడుతో వెళుతుండగా గురువారం అర్ధరాత్రి తర్వాత గుంతకల్లు మండలం నక్కనదొడ్డి సమీపంలో దుండగులు అటకాయించి దారి దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఘటనకే సంబంధించి డ్రైవర్ ఇషాక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్రమత్తమైన గుంతకల్లు పోలీసులు జాతీయ రహదారిపై విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు గుత్తి నుంచి గుంతకల్లు వైపుగా వస్తున్న బొలెరో వాహనాన్ని గొల్లలదొడ్డి వద్ద అటకాయించి పరిశీలించారు. వాహన నంబర్ (ఏపీ 16ఈఎఫ్ 6661) ఆధారంగా దుండగులు ఉపయోగించిన వాహనం అదేనని గుర్తించి, అందులో ప్రయాణిస్తున్న అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఒకరు పారిపోగా ముగ్గురు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో గుత్తి ఆర్ఎస్‌కు చెందిన సి.హెచ్ అజయ్‌రాజ్, బి.ప్రశాంత్, గుత్తి మండలం లచ్చానుపల్లికి చెందిన వి.ఆదర్శ్‌రాజ్ ఉన్నారు. పరారీలో ఉన్న యువకుడిని జీవన్‌కుమార్‌గా నిర్ధారించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## వాహనం బోల్తా - తమిళనాడు వాసి దుర్మరణం





రాజశేఖర్ మృతదేహం వద్ద రోదిస్తున్న స్నేహితుడు, ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

**పరిగి:** మండలంలోని ధనాపురం క్రాస్ సమీపంలో 544ఈఈ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్న ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... తమిళనాడులోని క్రిష్ణగిరికి చెందిన రామకృష్ణ, సెల్వరాజ్, తమిళ్‌మణి, రాజశేఖర్ (58) నలుగురూ మడకశిర ప్రాంతంలో చేపట్టిన క్వారీల పనుల నిమిత్తం హిటాచీ వ్యాపార లావాదేవీలపై చర్చించేందుకు శనివారం వచ్చారు. మధ్యాహ్నం భోజనానికని టీఎస్ 29 బీహెచ్ 3456 నంబర్ సఫారీ కారులో హిందూపురానికి బయలుదేరారు. పరిగి మండలం ధనాపురం క్రాస్ దాటగానే జాతీయ రహదారిపై పల్లపు ప్రదేశంలో వేగంతో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. వాహనం డోర్లు తెరుచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న రామకృష్ణ, పక్కనే కూర్చొన్న రాజశేఖర్ ఎగిరి బయటకు వచ్చి పడ్డారు. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ముగ్గురినీ స్థానికులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ జయలత, హెచ్‌సీ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలను స్థానికులతో ఆరా తీశారు. క్షతగాత్రుల బంధువులకు సమాచారం అందించామని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## విషజ్వరంతో చిన్నారి మృతి



అనిరుద్ సాయి (ఫైల్)

**పరిగి:** విష జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పరిగి మండలం ఆనందపాళ్యం గ్రామానికి చెందిన జయరాం, జ్యోతి దంపతుల కుమారుడు అనిరుద్ సాయి(6) జ్వరంతో శనివారం వేకువజామున మృతి చెందాడు. గత శుక్రవారం సాయంత్రం అనిరుద్ సాయికి జ్వరం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరం తీవ్రత పెరిగడంతో వైద్యుడి సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రైవేటు ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ చనిపోయినట్లు తండ్రి జయరాం ఆరోపించారు.

**ఆనందపాళ్యంలో వైద్య సిబ్బంది పర్యటన..**

చిన్నారి అనిరుద్ మృతి చెందిన విషయం తెలుసుకున్న పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి, జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న తదితరులు శనివారం ఆనందపాళ్యంలో పర్యటించారు. చిన్నారి కుటుంబసభ్యులను కలిశారు. జరిగిన పరిణామాలను తల్లిండ్రులతో ఆరా తీశారు. చిన్నారి అనిరుద్ సాయికి జ్వరం వచ్చిందని అది మూర్ఛగా మారడంతో ప్రాణాపాయం కలిగిందని, జరిగిన పరిణామానికి తామెంతో చింతిస్తున్నామన్నారు. మలేరియా, డెంగీతో చిన్నారి చనిపోలేదని నిర్ధారించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన సాయి స్మరణం



కచేరి నిర్వహిస్తున్న తమిళనాడు సత్యసాయి యూత్ సభ్యులు

**ప్రశాంతి నిలయం:** సత్యసాయిని స్మరిస్తూ తమిళనాడుకు చెందిన సాయి యూత్ సభ్యులు శనివారం సాయంత్రం నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తర కన్నడ జిల్లాలో ప్రజలకు దంతపరమైన వైద్య సేవలు ఉచితంగా అందించే లక్ష్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సత్యసాయిసెంట్రల్ ట్రస్ట్ రూపొందించిన మొబైల్ డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించారు. సత్యసాయి మహాసమాధి వద్ద వాహనానికి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి

**గుంతకల్లు టౌన్:** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ అనంతరం ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని, ఈ అంశంపై ప్రజలను చైతన్య పరచాలని సిబ్బందిని జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. ఏ చిన్నపాటి గొడవకు దిగినా, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. శనివారం స్థానిక వన్‌టౌన్ పీఎస్‌కు విచ్చేసిన ఆయన కౌంటింగ్ రోజు, ఆ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అర్బన్, రూరల్ పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ఫలితాల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని రాజకీయ పార్టీల శ్రేణులు, ప్రజలకు సూచించారు. నియోజకవర్గంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, డీజేలు, మైక్‌సెట్‌లకు ఎలాంటి అనుమతులుండవని తెలిపారు. మంగళవారం మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత రోడ్లపైకి వచ్చి గొడవల్లో ఇరుక్కుని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోరాదన్నారు. అనంతరం ఫలితాలు వెలువడే రోజున మొబైల్ పార్టీలు, క్యూఆర్‌టీ, రక్షక్, బ్లూకోట్ టీమ్‌లు ఎలా స్పందించాలో రిహార్సల్స్ చేయించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్, మహేశ్వరరెడ్డి, ఎస్ఐలు సురేష్, దుగ్గిరెడ్డి, రంగస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### పామిడిలో దొంగ హల్‌చల్



గుండప్పరావు కాలనీలో సంచరిస్తున్న అనుమానాస్పద దొంగ

**పామిడి:** స్థానిక గుండప్పరావు కాలనీలో శనివారం వేకువజాము 1.30 గంటలకు ఓ దొంగ హల్‌చల్ చేశాడు. వీధిలో కలియ తిరుగుతూ సీసీ కెమెరాల కంటపడ్డాడు. గుర్తించిన కాలనీవాసులు అప్రమత్తమయ్యేలోపు దొంగ పక్కనే ఉన్న మదీనా కాలనీలో నుంచి బైపాస్ వైపుగా పరుగు తీసి చీకట్లో కనుమరుగయ్యాడు. కాగా, నాలుగు నెలల క్రితం కూడా గుండప్పరావు కాలనీలో నలుగురు దొంగలు హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. గుండప్పరావు కాలనీ, మదీనా కాలనీ, గుప్తాకాలనీలు బైపాస్‌కు సమీపంలో ఉండడంతో అనుమానాస్పద యువకుల సంచారం ఎక్కువగా ఉంటోంది. చీకటి పడితే అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్న ఆయా కాలనీల్లో పోలీసులు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

### పంటల సాగులో మెలకువలు పాటించాలి

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

**ఉరవకొండ:** పంటల సాగులో మెలకువలు పాటించాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తం అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఏఓ మాట్లాడుతూ... ఖరీఫ్‌లో పంటల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నామన్నారు. అవసరమైన మేర ఎరువులనూ అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజ, ఉరవకొండ మండల వ్యవసాయాధికారి శుభకర్, కృషి విజ్ఞాన కేంద్రం ఏఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి బలవన్మరణం



మృతుడు వీరనారాయణ

**కూడేరు:** మండలంలోని కమ్మూరులో శనివారం సాయంత్రం బోయ వీరనారాయణ(42) అనే వ్యక్తి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పద్మావతి, ఇద్దరు కుమారులున్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి. కుటుంబ కలహాలతోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుపడ్డ మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

**కూడేరు:** మండలంలోని మరుట్ల-2వ కాలనీకి చెందిన ఎరికల శివయ్య... ఆటోలో కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ శనివారం సెబ్ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు సెబ్ సీఐ యల్లయ్య తెలిపారు. నిందితుడి నుంచి 14 బాక్సుల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

## క్లుప్తంగా

### పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న మహిళా పోలీస్ అనురాధ

**ఆత్మకూరు:** మండల కేంద్రంలో శనివారం సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కొనసాగింది. మండల వ్యాప్తంగా 5,935 మంది లబ్ధిదారులకు రూ.1,76,34,500 నగదును ప్రభుత్వం మంజూరు చేసింది. దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము అందజేశారు. అయితే బ్యాంక్ ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ అయిన లబ్ధిదారులు నగదు తీసుకునేందుకు బ్యాంకుల వద్ద బారులు దీరారు. వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### రైతు సేవలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు



కేక్ కట్ చేస్తున్న ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి, ఇతర అధికారులు

**అనంతపురం అగ్రికల్చర్:** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ద్వారా రైతులకు మొదటి ప్రాధాన్యత కింద విరివిగా రుణాలు, ఇతరత్రా సేవలు అందిస్తున్నట్లు ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. శనివారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో బ్యాంకు 19వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ... 65 బ్యాంకు శాఖల ద్వారా జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో సైతం రైతులు, పేదలు, మహిళలు, ఇతరత్రా అన్ని వర్గాలకు ఆధునిక బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బ్యాంకు ఆవరణలో రక్తదానం నిర్వహించారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్, చీఫ్ మేనేజర్లు, బ్రాంచి మేనేజర్లు, విశ్రాంత అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

### సంత రోజున ట్రాఫిక్ ఇక్కట్లు



మార్కెట్‌యార్డు గేటు ఎదురుగా ఆటోలను అడ్డంగా పార్క్ చేయడంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

**అనంతపురం సెంట్రల్:** గుత్తి రోడ్డులో ప్రతి శని, ఆదివారం గొర్రెలు, మేకలు, పశువుల సంత జరుగుతుంది. వందలాది వాహనాల ద్వారా సంతలోకి జీవాలను తీసుకొస్తారు. దీనికి తోడు వ్యాపారస్తులు, రైతులతో ఆ ప్రాంతం మొత్తం రద్దీగా మారుతోంది. కొంతమంది వ్యాపారస్తులు ప్రధాన రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో శని, ఆదివారాల్లో ట్రాఫిక్ సమస్యలలు తలెత్తుతున్నాయి. అయినప్పటికీ ఇటు మార్కెట్‌యార్డు అధికారులు, అటు పోలీసులు కానీ ట్రాఫిక్ ఇబ్బందులపై దృష్టి సారించడం లేదు. దీంతో సామాన్య వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇప్పటికైనా స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



సర్టిఫికెట్ అందుకుంటున్న గౌతమి

**అనంతపురం కల్చరల్:** రక్తదాతలు సంజీవినితో ప్రాణం కాపాడిన హనుమంతుడితో సమానమేనని రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్ అన్నారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ వారు స్థానిక హౌసింగ్ బోర్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్‌తో పాటూ ఆలయ కమిటీ ప్రతినిధి పరుచూరు రమేష్‌బాబు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. నిత్యం జరుగుతున్న ప్రమాదాల వల్ల చాలా మంది రక్తం అందక మరణిస్తున్నారన్నారు. సేవాభావం కలిగిన యువత నిండు ప్రాణాలను రక్తదానంతో కాపాడవచ్చని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన గౌతమి (ట్రాన్స్‌జెండర్)ను అభినందించి సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యకర్తలు జయమారుతి, రఘుయాదవ్, రాజా, నందిత తదితరులు పాల్గొన్నారు.

# అంజనీపుత్రా.. నమోనమః



**రాప్తాడు:** అలంకరణలో 39 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం

**అనంతపురం కల్చరల్:** నగరంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. భక్తజన కోటి 'శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం' అంటూ హనుమాన్ నామస్మరణతో స్వామిని దర్శించుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్ని చోట్లా అభిషేకాలు, అలంకార సేవలు, ఆకుపూజలు, అన్నదానాలు, గ్రామోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

- మారుతీనగర్ కోదండ రామాలయం భక్తజన సంద్రంగా మారింది. ఉదయం నుంచే నాగరాజ శర్మ ఆధ్వర్యంలో విశేష ఆకుపూజలు, వడమాల హారాలతో స్వామికి పూజలు చేశారు. రెవెన్యూ కాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకల్లో చాలీసా పారాయణం, వేదపండితుల ప్రవచనం జరిగాయి. టీటీడీ నిర్వాహకులు బాబు, పండిట్ వేణు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.
- స్థానిక కోర్టు రోడ్డులోని వరదాంజనేయ స్వామి దేవాలయంలో హనుమజ్జయంతి ఘనంగా జరిగింది. సువర్చల సమేత హనమద్ వ్రతం, పవమాన హోమం అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖరరెడ్డి, జయచంద్రనాయుడు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తపోవనంలో శివశక్తిబాబా మందిరంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. 1,008 మర్కటాలకు ఫలాలు అందించి పూజించారు. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో, స్థానిక హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయస్వామి ఏకశిలా విగ్రహ దేవాలయంలో ఆంజనేయుడికి పూజలు చేపట్టారు.
- స్థానిక నాలుగో రోడ్డు కసాపురం ఆంజనేయ స్వామి ఆలయం, ఐదవ రోడ్డు పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం తదితర చోట్ల ప్రత్యేక పూజలు జరిగాయి. హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో జరిగిన వేడుకల్లో పీఠాధిపతి విద్యానృసింహ భారతీ స్వామీజీ ముఖ్య అతిథిగా విచ్చేసి అనుగ్రహభాషణం చేశారు. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చందనదారుడైన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు.



పూజలందుకున్న నాలుగో రోడ్డులోని కసాపురం ఆంజనేయ స్వామి



మారుతీనగర్‌లో వడలహారంలో హనుమంతుడు



**కనగానపల్లి:** ఆంజనేయ స్వామికి పూజలు



**చెన్నేకొత్తపల్లి:** అలంకరణలో ఆంజనేయుడు

**ఆత్మకూరు:** మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆత్మకూరులోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి విగ్రహాన్ని పూలతో అలంకరించారు. తమలపాకులపై జై శ్రీరామ్ అంటూ రాసిన ఆకులను స్వామికి పూలహారంగా వేశారు.

**మౌనగిరిలో భక్తుల సందడి**

**రాప్తాడు:** హంపాపురంలోని 44వ జాతీయ రహదారి సమీపంలోని మౌనగిరి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. శనివారం ఉదయం మౌనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో 39 అడుగుల ఎత్తుగల ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేశారు. మహాభిషేకం, పుష్పాభిషేకం, మహాగణపతి పూజ, సహస్ర శ్రీరామ నామ పారాయణం, సీతారామ కల్యాణం, అభిషేకం, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించారు. రాప్తాడు, బొమ్మేపర్తి, గొందిరెడ్డిపల్లి, ఎం.బండమీదపల్లి, మరూరు, హంపాపురం, ప్రసన్నాయపల్లి గ్రామాల్లో సందడి నెలకొంది.

**అలరించిన భజన కార్యక్రమాలు..**

మౌనగిరి క్షేత్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వివిధ రకాల భజన వాయిద్యాలతో దేవతా మూర్తులను స్మరిస్తూ నిర్వహించిన భజనలు, భక్తి గీతాల ఆలపన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



**ఆత్మకూరు:** భక్తులకు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం



వలీస్వామి ఆశ్రమంలో పీఠాధిపతి విద్యానృసింహ భారతి

### ఆలయాల్లో భక్తుల సందడి

**కనగానపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కనగానపల్లి, మామిళ్లపల్లి, తగరకుంట, ముక్తాపురం, కుర్లపల్లి గ్రామాల్లోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయాలను ప్రత్యేకంగా అలకరించారు. కుర్లపల్లి వారదయ్య కొండపై వెలసిన ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివెళ్లారు.

**చెన్నేకొత్తపల్లి:** హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని ఆంజనేయ స్వామి దేవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. తొలుత ఆయా దేవాలయాల్లో స్వామి మూల విరాట్‌లకు అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామికి ఫల, పుష్పాలను సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీల సభ్యులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

## వాహనాలన్నీ ఒకేచోట పార్క్ చేయండి

- సమగ్రశిక్ష ఏపీసీ మైకోమ్ నిదియా దేవి



మైకోమ్ నిదియా దేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెక్టోరియల్ అధికారులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** కార్యాలయ ఆవరణలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలబెట్టకూడదు. అన్నీ ఒకచోట పార్క్ చేసేలా చూడాలని ఐఏఎస్ అధికారిణి, సమగ్రశిక్ష ఏపీసీ మైకోమ్ నిదియాదేవి సిబ్బందిని ఆదేశించారు. ఏపీసీగా బాధ్యతలు తీసుకున్న ఆమె శనివారం సమగ్రశిక్ష కార్యాలయానికి వచ్చారు. సెక్టోరియల్ అధికారులు, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. సెక్టోరియల్ అధికారులు, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు అందరితోనూ మాట్లాడారు. ఉద్యోగులను పరిచయం చేసుకుంటూ వారు చేస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. సమగ్రశిక్ష ద్వారా అమలవుతున్న విద్యా కార్యక్రమాలపై ఆరా తీశారు. కార్యాలయ ఆవరణాన్ని శుభ్రం చేయించాలని సూచించారు.

## కౌంటింగ్ రోజు అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించం



రాజకీయ నాయకులకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

**చెన్నేకొత్తపల్లి:** ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించం. అలాంటి వారిపై రౌడీషీటర్ నమోదు చేస్తామని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా చేరి గొడవలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టేందుకు అనుమతి లేదన్నారు. విజయం సాధించిన పార్టీల వారు బాణాసంచా కాల్చేందుకు అనుమతి లేదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జిల్లా బహిష్కరణ లేదా పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. కౌంటింగ్ రోజున కేంద్ర సాయుధ బలగాలను మోహరించడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక గ్రామల్లో డ్రోన్ కెమెరా ద్వారా వీడియోలను చిత్రీకరించడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఎక్కడా మద్యం విక్రయాలు జరుపరాదని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న చిన్నారుల డ్యాన్స్



ఫ్యాషన్ షోలో పాల్గొన్న బాలికలు

**అనంతపురం కల్చరల్:** స్థానిక రామచంద్రా నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం లహరి డ్యాన్సు అకాడమీ వారి వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంగా ఘనంగా జరిగింది. డ్యాన్స్ మాస్టర్ హరిప్రసాద్ నేతృత్వంలో శిక్షణ పొందిన చిన్నారులు తొలుత ఫ్యాషన్ షోతో మైమరిపించారు. వివిధ రకాల వేషధారణలతో అలరించారు. ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సామాజిక సేవా కార్యకర్త పద్మజ తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి చిన్నారులను ప్రోత్సహించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమానికి మాజీ మేయర్ రాగేపరుశురామ్, సామాజిక సేవకుడు రవికాంత్ రమణ ముఖ్య అతిథులుగా విచ్చేసి హరిప్రసాద్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా రాగేపరుశురామ్‌తో పాటూ సీనియర్ డ్యాన్స్ మాస్టర్లు పట్నం శివప్రసాద్, కత్తి విజయ్‌కుమార్, లక్ష్మీకాంత్ తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం జానపద, శాస్త్రీయ, సినీ గీతాలకు విద్యార్థులు డ్యాన్స్ చేశారు. శిక్షణ ముగించుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు.

## 'డీసీఈబీ' అక్రమాలపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ)లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు 2023–24 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు అందజేసిన «అనంత సంకల్పం» మెటీరియల్‌కు సంబంధించి లక్షల రూపాయలు సేకరించారన్నారు. కానీ విద్యార్థులకు సకాలంలో మెటీరియల్ అందించలేదని ఆరోపించారు. ఏటా ఈ కార్యక్రమం 100 రోజులు ఉంటే ఈసారి 70 రోజులకు కుదించారని తెలిపారు. చాలా ప్రభుత్వ విద్యాసంస్థలకు అనంత సంకల్పం మెటీరియల్ సరఫరా చేయలేదన్నారు. లక్షలాది రూపాయలు స్వాహా చేశారని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులతో ఎఫ్ఏ–1,2, ఎస్ఏ–1,2 పరీక్షల కోసం జిల్లాలో 650 ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి నుంచి రూ.200 వసూలు చేశారన్నారు. నిబంధనల ప్రకారం రూ.100–150 మాత్రమే వసూలు చేయాల్సి ఉందన్నారు. అక్రమాలపై విచారించి బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు పవన్, రారాజు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

### నేడు అపర ఏకాదశి వేడుకలు

**అనంతపురం కల్చరల్:** నగరంలోని రామనగర్ రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో ఆదివారం అపర ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మహా అభిషేకాలు, 8 గంటల నుంచి 10 గంటల వరకు రుక్మిణి, పాండురంగ స్వామి నిజపాద స్పర్శ దర్శనం ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు స్వయంగా స్వామి వారి పాదాలను తాకి పూజించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు.

### పొగాకు ప్రమాదకరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ఆత్మకూరు:** పొగాకు, సిగరెట్లు, బీడీలు కాల్చడం వల్ల తాగే వారికే కాకుండా పొగాకు పీల్చే వారికి కూడా ప్రమాదమే. ధూమపానం మానేయాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పొగాకు వినియోగం వల్ల కలిగే అనార్థాలను అనంతరం పొగాకుకు దూరంగా ఉంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

### జోరుగా పారిశుధ్య పనులు



మున్నానగర్‌లో పూడిక తీస్తున్న దృశ్యం

**అనంతపురం కార్పొరేషన్:** వర్షాకాలంలో కాలువలు బ్లాక్ కాకుండా నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పాలకవర్గం, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగు పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం నగరంలోని మున్నానగర్‌లో సక్షన్ మిషన్ ద్వారా పూడిక తీత పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పారిశుధ్య కార్మికులు సక్షన్ పరికరం ద్వారా తీశారు. తద్వారా వర్షం వచ్చినా.. కాలువలు బ్లాక్ అయ్యే అవకాశం ఉండదని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి పేర్కొన్నారు.

## కుష్టు, క్షయ రహిత సమాజమే లక్ష్యం



రికార్డులు పరిశీలిస్తున్న క్షయ, లెప్రసీ జిల్లా వైద్యాధికారి అనుపమ జేమ్స్

**రాప్తాడు:** కుష్టు, క్షయ వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని క్షయ, లెప్రసీ జిల్లా వైద్యాధికారి అనుపమ జేమ్స్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హంపాపురంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షయ, కుష్టు వ్యాధికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వ్యాధి లక్షణాలను వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజ భాగస్వామ్యంతో క్షయ (టీబీ) నివారణ సాధ్యమవుతుందన్నారు. టీబీ అంటు వ్యాధి అని.. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. దుమ్ము, ధూళి ప్రదేశాల్లో పని చేసే వారికి, మద్యపానం, ధూమపానం చేసే వారికి, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా సోకుతుందన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. కుష్టు (లెప్రసి) వ్యాధిపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అవగాహనతోనే కుష్టు వ్యాధిని నివారించవచ్చన్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి వైద్య చికిత్స అందిస్తే నివారించవచ్చని వెల్లడించారు. కుష్టు వ్యాధి సూక్ష్మ క్రిముల ద్వారా వస్తుందని, చిన్న పిల్లలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. గ్రామాల్లో దోమకాటు వలన విష జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా సిబ్బంది విధులకు హాజరు కాకున్నా, రోగులకు వైద్యం సక్రమంగా అందించక నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ సత్యనారాయణ, టీబీ సూపర్‌వైజర్ రేవతి, సీహెచ్‌వో శివ ప్రసాద్, సూపర్‌వైజర్లు నరసింహ, అరుణ, పాల్గొన్నారు.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



వెంకటంపల్లిలో గడ్డివాముల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

**చెన్నేకొత్తపల్లి:** గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ నెల 4వ తేదీన వెల్లడి కానుండటంతో మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం మండల పరిధిలోని వెంకటంపల్లిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తొలుత గ్రామంలో ఏపీఎస్పీ, స్థానిక పోలీసులతో కలసి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులు, గతంలో లిక్కర్ కేసులు ఉన్న వారి ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో సమావేశం నిర్వహించి, ప్రజలకు సూచనలిచ్చారు. ప్రశాంతంగా ఉన్న వారిని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

### అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు



డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత



నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మహిళా ఉద్యోగులపై ఎటువంటి లైంగిక వేధింపులు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకునేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. క్లాస్ ఫోర్ ఉద్యోగుల నుంచి స్టాఫ్‌నర్సులు, వైద్యులపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే సదరు కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. కమిటీ ప్రిసైడింగ్ అధికారిగా డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, కన్వీనర్‌గా నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, సభ్యురాలిగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.సునీతను నియమించారు.



### రగ్బీ పోటీల విజేతలు అనంతపురం, నెల్లూరు



ట్రోఫీ అందుకున్న క్రీడాకారులు

**కొమ్మాది (విశాఖ జిల్లా):** భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో శుక్రవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. 9వ రాష్ట్రస్థాయి రగ్బీ బాలికల విభాగంలో అనంతపురం, బాలురు విభాగంలో నెల్లూరు జట్లు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. బాలురు విభాగంలో నెల్లూరు, కర్నూలు, తూర్పు గోదావరి జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అదే విధంగా బాలికల విభాగంలో అనంతపురం, గుంటూరు, ఈస్ట్‌గోదావరి జట్లు మొదటి 2, 3 స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఆంధ్రప్రదేశ్ రగ్బీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ట్రోఫీ అందజేశారు.